కథ

# ప్రయాణం

ఆఫీసులో ఒకటే పని హడావిడి, వారం నుండి రాత్రింబవళ్ళు చేస్తున్నా ఒక్క కొలిక్కి రావటం లేదు. ఈ ఆడిట్ వాళ్ళు ఎప్పుడు వస్తారో ఏమో అనుకుంటుండగా ఫోను వచ్చింది, విసుక్కుంటూ ఎవరా అని చూస్తే విష్ణు ఫోను.

ఆ అబ్బాయి ఎంతో అర్జంటు అయితే గాని ఫోను చేయడు. ఏమిటో అనుకుంటూ ఫోను ఎత్తగానే వదినా అమ్మకు సీరియస్‌గా వుంది అని చెప్పి హడావిడిగా ఫోను పెట్టేశాడు. ఎక్కడి ఫైల్సు అక్కడే పడేసి ఆఫీసులో చెప్పి ఇంటికి పరుగెత్తి అయిదవ నెల నిద్ర చేయడానికి వచ్చిన ఆడబిడ్డను రెడీ చేసుకొని గబగబ పరుగెత్తి ఎలాగోలా హౌరా ఎక్స్‌ప్రెస్ పట్టుకున్నాము. నిలబడటానికి కొంచెం స్థలం దొరికితే ఒట్టు. నేను ఎలాగో ఓపికగా నిలబడగలను, వసంతను చూస్తుంటే జాలేస్తుంది. చిన్నగా దారి చేసుకొని కంపార్టుమెంటు లోపలికి దూరాను. ఒకటే వాసన, కంపార్టుమెంటు అంతా గందరగోళం, ఎక్కువమంది మగవాళ్ళు వున్నారు. మధ్య మధ్య పిల్లలకు ఉయ్యాలలు వేశారు. అందరూ బీడీలు తాగుతున్నారు. కొంతమంది అదే ఛేతిలో పొగాకుపొడి వేసుకొని వేలితో నలుపుకొని నోట్లో వేసుకోవటం, చాలామంది మగవాళ్ళు గాలి చాలక చొక్కాలు విప్పుకొని కూర్చున్నారు. వీళ్లందరు వలస కూలీలు, చెన్నైలో కంపెనీలలో పని చేస్తుంటారు. సంక్రాంతి పండుగకని ఊరికి బయలుదేరారట. ప్రతి సీటు వద్ద కొంచెం స్థలం ఇవ్వమని బ్రతిమిలాడినా ప్రయోజనం లేదు. ఒక్కరు కూడా సర్దుకోవటం లేదు. నాకనిపించింది నేను చాలా సార్లు నిలబడి సీట్లు ఇచ్చిన సందర్భాలు గుర్తుకు వచ్చి, వచ్చేకొద్ది మనుషులలో దయ, జాలి కనుమరుగవుతున్నాయా? అనిపిస్తుంది. యిక చేసేది లేక నేను వచ్చి వసంతతో గేటు వద్ద నిలబడిపోయాను. గంట తరువాత స్టేషను వచ్చింది. నన్ను తోసుకుంటూ ఒక విచిత్రమయిన ఆకారం రైలులోకి నెట్టుకొని వచ్చింది. ఆమె నన్ను తాకటంతోనే నా ఒళ్లు గగుర్పొడిచింది. ఈ రైలు ఆమె సొంతమయినట్లు అందరిని జరగండి అంటూ అదిలించుకుంటూ తన దారిని సులభం చేసుకుంటూ ముందుకు వెళ్ళింది. ఎంత అసహ్యంగా వుంది. నోటినిండా జర్దా కిల్లీ వేసుకొని నోరంతా ఎండిపోయి పళ్లు గారపట్టి అసహ్యంగా వుంది. నోరు తెరిస్తే ఆ వాసనకు కడుపులో తిప్పుతున్నట్లయింది. బాగా బిగుతైన బెత్తెడు జాకెట్టు, ఆ జాకెట్‌లోంచి పైకి బాగా కనపడేట్టు వక్షోజాలు, సగం పైటతో వక్షోజాలు స్పష్టంగా కనబడుతున్నాయి. బొడ్డు క్రిందవరకు జారిపోతూ వున్న సిల్కుచీర, జడ వేయకుండా జుట్టు వదిలివేసి రిబ్బనుతో కట్టి బోలెడు పూలు పెట్టుకుంది. మెడలో పిచ్చి పిచ్చి గొలుసులు, చేతుల వేళ్ళకు గిల్టు ఉంగరాలు, రైలు ఎక్కి స్థిమిత పడి బావలు బావలు అంటూ చేతులతో చప్పట్లు కొట్టటం, రకరకాల బూతు మాటలు ఉపయోగిస్తూ అక్కడ వున్న ప్రతి మగాడిని కవ్వించటం, వాళ్ళ ఒళ్ళో కూర్చోవటం, వాళ్ళ బుగ్గలు నిమరటం, వాళ్ళ చొక్కాల గుండీలు విప్పి రెచ్చగొట్టటం, పచ్చి బూతు సినిమాల పాటలు పాడటం, వాతావరణం చాలా జుగుప్సాకరంగా వుంది. ఆడవాళ్ళ పరువు తీస్తుంది అనిపించింది.

పూసపాటి రాజ్యలక్ష్మి

పది రూపాయలు తక్కువ యిచ్చారా, వాళ్ళ దుంప తెంచుతుంది. మాట్లాడితే తొడలాదాకా చీర ఎత్తటం, తొడను చరిచి మాట్లాడటం, యింకా ముందుకు వెళ్ళి కుర్రపిల్లాళ్లను మరీ మరీ ఆటపట్టిస్తుంది. వీళ్ళందరూ చోద్యం చూస్తున్నట్లు, యిదంతా మామూలు అన్నట్లుగా బాగా ఎంజాయ్ చేస్తున్నారు. పది రూపాయలు యిచ్చిన వాళ్ళను బుగ్గలు నిమరటం, వేళ్ళు విరిచి ముద్దు చేయటం, వాళ్ళ ఒళ్ళో కూర్చొని లేవటం. ముందుగానే చేతుల్లో పదిరూపాయలు నోటు పట్టుకొని తమ దగ్గరకు ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూస్తూనే ఉన్నారు. ఆమెను నేను చాలా సీరియస్‌గా చూస్తూనే ఉన్నాను. ఆమె పనిలో ఆమె ఉన్నా మధ్య మధ్యలో నావైపు ఒక కన్నువేసి గమనిస్తూనే ఉంది. ఆమె చూసినప్పుడు నా మనస్సుకు నాకు ఛీ అనిపించింది. బ్రతకటానికి ఎన్ని దారులు లేవు, యిలా సగం శరీరాన్ని బూతును మేళవించుకొని జబర్దస్తుగా డబ్బులు దండుకునే పద్ధతి కన్నా ఆడతనాన్ని యింత నిస్సిగ్గుగా పరువు తీస్తున్న వైనం నాకు చిరాకనిపించింది. ఆమెను చడామడా తిట్టాలని వుంది. యింకా చెప్పాలంటే చెంప ఛెళ్ళుమనిపించాలని వుంది. గంట నుండి యింత మంది మగాళ్ళ మధ్య నిలబడినందుకు, వాళ్ళు గమనిస్తున్న చూపుల నుండి తట్టుకోలేని విషమ పరిస్థితిని ఎదుర్కోవటమే చాలా బాధ కలిగిస్తుంటే, ఈమె చేస్తున్న వికృత చేష్టలు నన్ను నిలబడనీయటం లేదు. దండిగా డబ్బులు సమకూరాయి. అరగంటలో ఆ కంపార్టుమెంటులో బాగానే పదుల నోట్లు చేతినిండా పట్టుకుంది. యిక్కడ అయిపోయిన తరువాత ప్రక్క కంపార్ట్‌మెంటులోకి వెళ్లింది.

ఆమె కనబడకపోయినా ఆమె గురించి ఆలోచనలు నన్ను ప్రశాంతంగా వుండనీయటం లేదు. ఆడదాన్ని ఆటవస్తువుగా తయారు చేసిన వ్యవస్థ మీద 'ఛీ' అని ఉమ్మి వేయాలనిపించింది. అలా ఆలోచనలో వున్న నాకు మళ్లా అరగంటకల్లా యిదే కంపార్టుమెంటుకు వచ్చి మరలా అందరిని కవ్విస్తూనే ఉంది. హుషారుగా వున్న కుర్రకారు ఆమెను ఆటపట్టిస్తూ డాన్సులు కూడా వేస్తున్నారు. పది

నిమిషాల్లో ప్రక్క స్టేషను వస్తుందనగా నా దగ్గరకు వచ్చి నిలబడింది. ఆమె నాదగ్గరగా రావడమే నాకు ఒళ్లంతా గొంగళిపురుగులు పాకుతున్నట్లు వుంది. యింతలో ఆమె నన్ను చూసి "మేడమ్ ఎంతసేవటి నుండి ఈడ నిలబడి వున్నారు" అని అగిగింది. దానికి సమాధానం చెప్పటం యిష్టం లేనట్లు నేను ముఖం ప్రక్కకు పెట్టగానే, వసంత వుండలేక 'రెండు గంటల నుండి యిలానే నిలబడి వున్నామని' చెప్పింది. అంతే చీరకొంగు బిగించి సివంగిలా మగాళ్ళ మీదకు ఉరికింది, "దొంగ నా కొడుకుల్లారా మీకు జ్ఞానం ఉందిరా? ఆడ కూతుళ్ళు ఇద్దరు నిలబడి వుంటే సర్దుకోను మీకు మనస్సు రాలేదా? అదీ కడుపుతో వున్న ఆడది నిలబడితే మీరు దున్నపోతుల్లాగా కూర్చున్నారు కదరా? మీరేం మనుషులురా! చెన్నై కాద నుండి కూర్చొని వస్తున్నారు. కూర్చొని, కూర్చొని కాళ్ళకు వాపులు వస్తాయిరా! కొంచెంసేపు నిలబడితే మీ సొమ్ము ఏమి పోయిందిరా! అంటూ యిద్దరు కుర్రాళ్ళను పట్టుకొని సన్యాసి కొడుకుల్లారా, లేరా లే లేచి నిలబడు నీకు నీ పక్కనోడికి ఏంమ్మాయరోగంరా? గేట్లో కూర్చొన్నా గాని ప్రయాణం చేయొచ్చు, ఎంతోమంది మగాళ్ళు గేట్లో కూర్చోవటంలా, ఒల్లు బలిసి కొట్టుకుంటు న్నారురా! లేవండిరా" అని చెయ్యి పట్టుకు లాగింది. ఆమెకు ఎవ్వరూ ఎదురు చెప్పలేదు. టక్కున లేచి నిలబడ్డారు. అదే యిందాక ఎంత బ్రతిమిలాడినా" మాకే యిరుగ్గా ఉంది, మావల్ల కాదు, దూరం నుండి ప్రయాణం చేసి వస్తున్నాము.'' సర్దుకోముగాక సర్దుకోమని భీష్మించుక్కూర్చున్నారు. ఆమె చెప్పటం ఆలస్యం టక్కున లేచి మాకు సీటు ఇచ్చారు. రా మేడమ్.

ఈడ కూర్చోండి అసలే కడుపుతో ఉన్న బిడ్డ ఎలా నిలబడతాది, మీరు యిలా మెతగ్గా ఉంటే ఎవ్వరూ సీటు ఇవ్వరు, నాలాగు దబాయిస్తేనే వీళ్ళు దారికి వచ్చేది. మీకు ఆడోళ్ళంటే ఎంత చులకనరా! నేను వచ్చి ఒళ్ళో ఎప్పుడు వాలాతానా అని చేతిలో డబ్బులు పెట్టుకొని ఎదురు చూస్తున్నారు కదరా! అదే కడుపుతోనున్న ఆడమనిషికి యింతచోటు యివ్వాలన్న మతిలేని నా కొడుకులు మీరు అంటూ, "అమ్మ ఏవూరు దాకా వెళ్లాలి" అని అడిగింది. నాకు తెలియకుండ నానోటి వెంట విజయవాడదాకా అని చెప్పేశాను. అదే యిందాక ఆమెకు సమాధానం చెప్పటానికి ముఖం త్రిప్పుకున్న నాకు సిగ్గు అనిపించింది.

ఒరేయ్, విజయవాడ దాకా ఈ అమ్మలిద్దరిని లేపారా! మీ బొక్కులు పగిలిపోతాయి. నేను పై కంపార్ట్‌మెంటుకిపోయి వస్తా, మళ్ళా విజయవాడ వచ్చే ముందు వచ్చి సూస్తా, వీళ్ళు నిలబడి వుండాలా. మీ సంగతి చూస్తానురా అంటూ ఆమె స్టేషను రాగానే దిగిపోయింది. యిప్పటిదాకా ఆమె ఆడవాళ్ళ పరువు తీస్తుందని మనస్సులో ఎంత బాధపడ్డాను, ఆడవాళ్ళ పరువు నిలబెడుతూ మగాళ్ళను నిలబెట్టినందుకు ఆమెకు థాంక్స్ చెప్పాలనిపించింది. కాని పెదవి దాటి రాలేదు. ఎందుకంటే వృత్తి వేరు, ధర్మం వేరు. అంత కంటే జుగుప్సాకరమైన ఆమె రూపం, చేష్టల కన్నా మానవతా విలువలను నిలబెట్టిన విషయం అర్థం చేసుకోవటానికి నామనస్సు చాలా ఘర్షణకు గురి అయింది.

# స్పృహ

డా॥ ఎన్.గోపి

ఎన్నెన్ని దారుణాలెదురైనా
జీవితాన్ని ప్రేమిస్తాన్నేను
ఇంత యాంత్రికతలోకూడా
దాని మాంత్రికశక్తికి ఆశ్చర్యపోతాను.
బాల్యం
యవ్వనం
వృద్ధాప్యం
ఎగుడుల నదీ గమనంలో
ఏం సాధించామని దిగులు పడతాను.
ఎంతకూ అర్థంకాని సూర్యుడు
ఎంతకూ లోతు దొరకని చీకటి
ఆకాశం నుంచి దిగివచ్చే
కన్నీటి కుండను పగుల గొడతాను.
ఇంతేగదా జీవితం అనుకోను
దాని ప్రహేళికను చీలికలు చేస్తాను
స్థిమితం క్షణికమై
భద్రత బద్దలై
చెల్లాచెదురయ్యే చీమల్ని
ఆసక్తిగా గమనిస్తాను.
ఇంతటి మార్మిక చేతనలో కూడా
దీని భౌతికాకర్షణకు ముచ్చట పడతాను
ఆధిపత్యం కోసం
అంగలార్చే బలహీనతల్ని
అందవిహీనమైన సౌందర్యాల్ని
వైరుధ్యాల యుద్ధతంత్రుల్ని
వెర్రి ముఖాలతో చేసే వ్యాఖ్యానాల్ని
ఒక్క మెలకువతో తిరస్కరిస్తాను.
నిర్విరామ నిరామయ
నిరంతర యాత్ర కోసం
లేచి నిలబడే అడుగులను
పదేపదే అభినందిస్తాను.
ఏదీ శాశ్వతం కాదంటూనే
కల్పాంతం దాకా ఆలోచనలు చేసే
దాని అజ్ఞానంలోని నిబ్బరాన్ని
నిర్ద్వంద్వంగా నిరాకరిస్తాను
పొద్దున్నే ఇంటిముందు
భళ్లున విచ్చుకున్న పువ్వును చూసి
జీవితాన్ని ప్రేమించక తప్పదనే
సత్యాన్ని తెలుసుకుంటాను